
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 22 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



'సోషల్' స్టార్ ప్రశాంత్

తన వీడియోల ద్వారా ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తూ 'సోషల్ మీడియా' స్టార్‌గా దూసుకుపోతున్నాడు ప్రశాంత్ అలియాస్ ప్రసూబేజీ.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
38.3°/22.9°

జిల్లాలో బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది.

న్యూస్‌రీల్

11 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: నైరుతి రుతుపవనాల ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం జిల్లాలోని 11 మండలాల పరిధిలో వర్షం కురిసింది. అత్యధికంగా ఎన్‌పీకుంట మండలంలో 46.2 మి.మీ మేర వర్షం కురిసింది. గుడిబండ 14 మి.మీ ,తనకల్లు 12.6 మి.మీ, కదిరి 11 మి.మీ, అమడగూరు 10.8 మి.మీ, గాండ్లపెంట 7.0 మి.మీ, ఓడీ చెరువు, నల్లచెరువు మండలాల్లో 4.2 మి.మీ, తలపుల, బత్తలపల్లి మండలాల్లో 2.0 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మరో నాలుగురోజులు అక్కడక్కడా ఓ మాదిరిగానూ, మరి కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

నవోదయ ఫలితాల విడుదల



లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఏప్రిల్ 29వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. లేపాక్షి విద్యాలయానికి సంబంధించి 78 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు పోస్టల్ కార్డు, ఇతర కమ్యూనికేషన్ ద్వారా సమాచారం ఇస్తామన్నారు. ఫలితాలు www. navodaya. gov.in వైబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచామన్నారు. సమగ్ర వివరాల కోసం లేపాక్షి విద్యాలయను సంప్రదించాలని సూచించారు.

సత్యసాయి ప్రైమరీ పాఠశాలల ప్రవేశాలకు లాటరీ

ప్రశాంతి నిలయం: సత్యసాయి ప్రైమరీ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశాలకు ఈనెల 25న లాటరీ తీయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శివరామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ ఆడిటోరియంలో లాటరీ ప్రక్రియ ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయం 9.45 గంటలకు ఆడిటోరియానికి చేరుకోవాలని సూచించారు.

దిశ యాప్‌తో తక్షణ రక్షణ



యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

అనంతపురం సిటీ: దిశ యాప్‌తో మహిళలకు సంపూర్ణ రక్షణ లభిస్తుందని డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. దిశ యాప్‌ను ప్రతి విద్యార్థినీ తమ సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. బుధవారం ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థినులతో డీఐజీ మాట్లాడారు. యాప్ రిజిస్ట్రేషన్, ఇన్‌స్టలేషన్‌తో పాటు ఎలా వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో 'దిశ' సీఐ చిన్న గోవిందు, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో యోగాసనాలు వేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది



విద్యార్థులు, అధికారులతో కలిసి యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



ఆరోగ్య 'యోగ'ం

- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం
- జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు
- స్వయంగా ఆసనాలు వేసిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి



యోగా ఆవశ్యకతను సిబ్బందికి వివరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ప్రశాంతి నిలయం/ పుట్టపర్తి టౌన్: యోగాను జీవితంలో భాగం చేసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో మెరుగైన జీవనం గడపవచ్చని కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు జరిగాయి. పుట్టపర్తి పట్టణంలోని హనుమాన్ కూడలి ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ అరుణ్‌బాబు విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం మాట్లాడుతూ, యువత యోగాను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. తద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి ఎస్వీ కృష్ణారెడ్డి, ఆర్డీఓ భాగ్య రేఖ, ఓంశాంతి ప్రతినిధులు లక్ష్మక్క, ఆయుష్ ప్రతినిధి డాక్టర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

యోగాతో మానసిక ఒత్తిడి దూరమవుతుందని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. యోగా గురువు రాఘవేంద్ర పోలీసు సిబ్బందితో వివిధ ఆసనాలు వేయించి యోగా ప్రాముఖ్యతను వివరించారు. అనంతర ఎస్పీ మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే మంచి పౌష్టికాహారంతో పాటు యోగా కూడా అవసరమన్నారు. యోగాతో మంచి ఆలోచన, గొప్ప జీవన శైలి అలవడుతుందన్నారు. నిత్యం ఒత్తిడితో కూడిన విధులు నిర్వర్తించే పోలీసు సిబ్బంది తప్పకుండా యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు వాసుదేవన్, విజయకుమార్, సీఐలు బాలసుబ్రమణ్యంరెడ్డి, రవీంద్రరెడ్డి, ఆర్ఐలు టైటస్, శ్రీశైలంరెడ్డి, నారాయణ, ఆర్ఎస్ఐలు రాజు, వెంకటేశ్వర్‌రావ్, ప్రదీప్ సింగ్‌తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు..

ఇండోర్ స్టేడియంలో..

సత్యసాయి విద్యాసంస్థలలో అంతర్జాతీయ యోగా వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోకులం వద్ద ఉన్న సత్యసాయి ఇండోర్ స్టేడియం వేదికగా యోగాసనాలు చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు జ్యోతి ప్రజ్వలన చేసి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాసంస్థలకు చెందిన నాలుగు వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు. యోగా శిక్షకుల సూచన మేరకు ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ రాజు మాట్లాడుతూ.. యోగాతో మానసిక ప్రశాంతత, పరిపూర్ణ జ్ఞానం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.రాఘవేంద్రప్రసాద్, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రయాణికుల భద్రతకు అధిక ప్రాధాన్యం

- సౌత్ వెస్ట్రన్ రైల్వే డీఆర్ఎం శ్యామ్‌సింగ్



సిగ్నలింగ్ పనితీరును ఆరా తీస్తున్న డీఆర్ఎం శ్యామ్‌సింగ్

హిందూపురం అర్బన్: ప్రయాణికుల భద్రతకు రైల్వే అధిక ప్రాధాన్యం ఇస్తుందని సౌత్ వెస్ట్రన్ రైల్వే డీఆర్ఎం శ్యామ్‌సింగ్ తెలిపారు. వరుస రైల్వే ప్రమాదాల నేపథ్యంలో బుధవారం ఆయన జనరల్ మేనేజర్ సంజీవ్‌కిషోర్‌తో కలిసి హిందూపురం రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులతో చర్చించారు. అనంతరం స్టేషన్‌లో రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ, టెర్మినళ్ల పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం సమస్యలు ఆరా తీయగా, లిఫ్ట్ లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, జనరేటర్ మరమ్మతులకు గురైందని స్టేషన్ మాస్టర్ రామచంద్ర, ఆన్ డ్యూటీ అధికారి గిరీష్ తెలిపారు. స్పందించిన డీఆర్ఎం.. లిఫ్ట్ మంజూరైందని, సిగ్నలింగ్ సిస్టంకు ఇబ్బంది లేకుండా త్వరిత గతిన జనరేటర్ ఏర్పాటు చేస్తామన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్టేషన్ కంట్రోల్ రూంతో పాటు ఇంజినీరింగ్ విభాగాలను పరిశీలించారు. డీఆర్ఎం వెంట వివిధ శాఖల రైల్వే అధికారులు కిరణ్, సోమప్ప, రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ ఉన్నారు.

'నేతన్న నేస్తం'పై అపోహలొద్దు

ధర్మవరం రూరల్: 'నేతన్న నేస్తం' పథకంపై అపోహలు అవసరం లేదని, అర్హులందరికీ వర్తిస్తుందని చేనేత, జౌళిశాఖ జిల్లా అధికారి ఆర్.రమేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నేతన్న నేస్తం లబ్ధిదారులైన చేనేత కార్మికులకు నూలు, రేషం బిల్లులు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సిన అవసరం లేకుండా యాప్‌లో మార్పులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. చేనేత కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

'జగనన్న సురక్ష' పేదలకు శ్రీరామ రక్ష

- 24 నుంచి ఇంటింటా 'సురక్ష' కార్యక్రమాలు
- ఇంటి వద్దే 12 రకాల సర్టిఫికెట్ల మంజూరు
- జిల్లాలో నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం



'జగనన్న సురక్ష'పై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్ (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. పౌర సేవలను సకాలంలో అందించడం కోసం తాజాగా 'జగనన్న సురక్ష' కార్యక్రమం అమలుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే గ్రామ సచివాలయాలు, మండల కేంద్రాలు, డివిజన్ కేంద్రాలు, కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం 'స్పందన' కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. సమస్యలకు మరింత నాణ్యమైన పరిష్కారం చూపేందుకు 'జగనన్నకు చెబుదాం' పేరుతో 1902 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తెచ్చారు. దీనికి అనుబంధంగా ఇప్పుడు 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఈనెల 24 నుంచి అమలు చేయనున్నారు.

ఇంటివద్దే సర్టిఫికెట్ల మంజూరు

'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు కలెక్టర్ అరుణ్‌బాబు ప్రణాళిక సిద్ధం చేశారు. తహసీల్దార్, ఎంపీడీఓ, మున్సిపల్ కమిషనర్ల అధ్యక్షతన అధికారుల బృందాలు ఏర్పాటు చేశారు. ఈనెల 24 నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం గురించి వివరిస్తారు. అదే సమయంలో ఎవరికైనా సంక్షేమ పథకాలు అందతపోయినా, వ్యక్తి గతంగా ఏవైనా సర్టిఫికెట్లు మంజూరు కాకున్నా వివరాలను సేకరిస్తారు. వాటికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, వినతి పత్రాలను తీసుకుంటారు. అనంతరం వాటిని అధికారులు దృష్టికి తీసుకుంటారు. జూలై 1వ తేదీ నుంచి ఆయా సచివాలయాల పరిధిలో నియమించిన ప్రత్యేక అధికారుల బృందాలు ఆయా గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేస్తారు. క్యాంపుల వివరాలు ముందస్తుగా పత్రికలు, డప్పు వేయించడం, వలంటీర్ల ద్వారా తెలియజేసి తీసుకున్న వినతులకు పరిష్కారం చూపుతారు. ఇందులో సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తారు. ఇందులో భాగంగా ఇప్పటికే అధికారుల బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ సచివాలయాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి సిబ్బంది, వలంటీర్లు, కార్యదర్శులకు దిశానిర్దేశం చేస్తున్నారు. మండలాల వారీగా షెడ్యూల్ ఏర్పాటు చేసి నెల రోజుల పాటు ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లనున్నారు.

ప్రతి అర్జీకీ పరిష్కారం

జిల్లాలో నెల రోజుల పాటు నిర్వహించనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ప్రజల నుంచి అందే ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతాం. ముఖ్యంగా 12 రకాల సర్టిఫికెట్లు వెంటనే అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఈ కార్యక్రమం కోసం జిల్లాలో 100కుపైగా అధికార బృందాలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పనిచేస్తున్నారు. – అరుణ్‌బాబు, కలెక్టర్

'జగనన్న సురక్ష' ద్వారా అందించే సేవలు

కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, మరణ ధృవీకరణ పత్రం, మ్యారేజ్ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్‌డేట్, కొత్త రేషన్ కార్డు, రేషన్ కార్డులో పేర్లు నమోదు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్ వంటి 12 రకాల సర్టిఫికెట్లు అందజేయనున్నారు.

నల్లకొండకు ఎసరు

- కొండ చుట్టూ భారీగా వెలసిన గుడారాలు
- 70 ఎకరాలపైనే భూమి కబ్జా
- పేదల నుంచి డబ్బు వసూలు చేస్తున్న నేతలు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు



కొండపై వేసిన గుడిసెలు

సాక్షి, పుట్టపర్తి: అర్హత ఉంటే చాలు వలంటీర్ ఇంటికే వచ్చి దరఖాస్తు చేయించి స్థలం, ఇల్లు మంజూరు చేస్తున్నారు. దీంతో కొందరు నేతల జేబుల్లోకి చిల్లగవ్వ వెళ్లడం లేదు. ఈ క్రమంలో కొందరు సరికొత్త దందాకు తెరతీశారు. కొండలు గుట్టలను ఎంపిక చేసుకుని వాటిపై గుడారాలు వేయిస్తున్నారు. ఇందు కోసం పేదల నుంచి వసూళ్లు చేస్తున్నారు. అయితే అనుమతిలేని ఈ చర్యల వల్ల అంతిమంగా పేదలే నష్టపోతున్నారు.

చేయి తడిపితే జాగా

కొత్తచెరువు నుంచి పుట్టపర్తి వెళ్లే మార్గంలో నల్లకొండ పచ్చగా కనిపించేది. నాలుగు రోజులుగా నల్లకొండపై రంగురంగుల చీరలు కనిపిస్తున్నాయి. చిన్నపాటి గుడారాలు, పాత చీరలతో వేసిన గుడిసెలు దర్శనమిస్తున్నాయి. అక్కడే మకాం వేసి కొందరు నేతలు... నిరుపేదలకు మాయమాటలు చెప్పి వారి వద్ద డబ్బులు గుంజుతున్నారు. మనిషిని బట్టి రేటు ఫిక్స్ చేస్తున్నారు. రూ.వెయ్యి నుంచి రూ.10 వేల వరకు ఒక్కొక్కరి నుంచి గుంజుతున్నారు. ఆ తర్వాత కొండపైన స్థలం చూపిస్తున్నారు. కొన్ని రోజుల్లోనే అధికారులు పట్టాలిస్తారని నమ్మబలుకుతున్నారు. దీంతో కొత్తచెరువు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉదయాన్నే కొండ పరిసర ప్రాంతాలకు చేరుకుంటున్నారు. నేతలు చూపిన ప్రాంతంలో చిన్నపాటి గుడిసెలు వేసుకుని ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే మకాం వేస్తున్నారు. చీకటి పడగానే.. స్వగ్రామాలకు తిరిగి వెళ్తున్నారు. ఇలా ఐదు రోజుల్లోనే సుమారు 70 ఎకరాలకుపైగా ఆక్రమణకు గురైంది.

నల్లకొండపై పట్టాలకు అనుమతుల్లేవు

కొత్తచెరువు: నల్లకొండపై పట్టాలిచ్చేందుకు అనుమతులు లేవని ఆర్డీఓ భాగ్యరేఖ స్పష్టం చేశారు. బుధవారం ఆమె తహసీల్దార్ రామాంజులరెడ్డి, సీఐ రామయ్యతో కలిసి నల్లకొండపై వేసిన గుడారాలను పరిశీలించారు. ప్రభుత్వ స్థలాన్ని ఎవరు ఆక్రమించినా శిక్షార్హులవుతారన్నారు. కొందరు ఇళ్ల పట్టాలిస్తామని నిరుపేదల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసిందని, అలాంటి వారి మాటలు నమ్మవద్దన్నారు. అనంతరం స్థానిక ప్రజలు, సీపీఐ నాయకులతో సమావేశం నిర్వహించారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుందని, ఇళ్లు మంజూరుకాని వారు ఎవరైనా ఉంటే వారికి తప్పక న్యాయం చేస్తామన్నారు.

● కదిరిలో భారీ వర్షం



రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

కదిరి టౌన్: పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం పడింది. రోడ్లు జలమయమయ్యాయి. వలీసాబ్ రోడ్డు, కంచుకోట, రాధాకృష్ణ వీధి, దేవళం బజారు, సింహకోట, ఆడపాలవీధి, అమీన్‌నగర్, బాబాకాలనీ, జొన్నకాలనీల్లోని రహదారుల్లో వర్షపు నీరు మోకాళ్ల లోతు ప్రవహించాయి. నీరు ఇళ్లలోకి రావడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు.



సింహకోట వద్ద ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి

- కేంద్ర కమ్యూనికేషన్ శాఖా మంత్రి దేవుసిన్హ్ చౌహాన్



మాట్లాడుతున్న కేంద్ర కమ్యూనికేషన్ శాఖా మంత్రి దేవుసిన్హ్ చౌహాన్

హిందూపురం టౌన్: బీజేపీతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పరిపాలనపై బుధవారం సాయంత్రం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రజలంతా బీజేపీని నమ్ముతున్నారని, 2024లో మళ్లీ అధికారం చేపడతామని, మోదీ పీఎం కావడం తథ్యమన్నారు. కరోనా విపత్కర సమయంలో కేవలం 9 నెలల్లోనే కోవిడ్ వ్యాక్సిన్‌ను తయారు చేసి దేశంలోని కోట్లాది మందికి ఉచితంగా టీకాలు వేసిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. కాశ్మీర్‌లో జాతీయ జెండా ఎగురవేయడం, పుల్వామా దాడి తర్వాత పాకిస్తాన్‌లోకి ప్రవేశించి ఉగ్రవాదులను మట్టుపెట్టడం, అయోధ్యలో రామమందిర నిర్మాణం చేపట్టడం నరేంద్ర మోదీ తోనే సాధ్యమైందన్నారు. దేశ భద్రతకు పీఎం మోదీ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. 'సబ్‌కా సాథ్... సబ్‌కా వికాస్'తో కులం, మతం పట్టించుకోకుండా ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు, సడక్ యోజనా ద్వారా రోడ్లు, ఉజ్వల, ఉజాల పథకాలు, ఆయుష్మాన్ కార్డులు దేశ ప్రజలందరికీ అందించారన్నారు. ఇంత చేస్తున్న బీజేపీకి మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దేవదర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వజ్రభాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పార్థసారథి, రాష్ట్ర నాయకులు దేవానంద్, రమేష్‌రెడ్డి, మేడికుర్తి హరి, భానుప్రకాష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

- ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలి
- సెప్టెంబర్ 15 నాటికి అన్నీ అందుబాటులోకి తేవాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

పుట్టపర్తి అర్బన్: వివిధ దశల్లో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణ పనులను సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణ పనుల పురోగతిపై కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీ రాజ్ ఇంజినీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 245 రైతు భరోసా కేంద్రాలు, 269 వైఎస్సార్ వెల్ నెస్ సెంటర్లు, 305 సచివాలయ భవనాలు పూర్తి కావాల్సి ఉందని, నిర్మాణ పనుల్లో వెనుకబడిన ఇంజినీర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఏఈలు రోజూ క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్మాణ పనులను పరిశీలించాలన్నారు. పీఆర్ ఇంజనీర్లు సమన్వయంతో పని చేసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. వారానికి ఒక సారి ఎస్ఈ, ఈఈలు, డీఈలు క్షేత్రస్థాయిలో పర్యటించి పనులు ఎలా జరుగుతున్నాయో పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. బిల్లులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ కొండయ్య, పంచాయతీ రాజ్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, ఈఈ మురళీమోహన్, ధర్మవరం, కదిరి, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, హిందూపురం, రాప్తాడు డివిజన్ల డీఈఈలు కన్నా, మధుసూదన్, వెంకటరమణ, పద్మావతి, శ్రీనివాసులు, హరికృష్ణ, ఏఈలు శశికుమార్, నాగరాజు, గుప్తా పాల్గొన్నారు.

క్లుప్తంగా

'రేషన్ డీలర్లకూ హెల్త్‌కార్డులు ఇవ్వండి'


మాట్లాడుతున్న వెంకటరంగారెడ్డి

పుట్టపర్తి టౌన్: రేషన్ డీలర్లకు బీమా సౌకర్యంతో పాటు హెల్త్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి కోరారు. స్థానిక సాయి ఆరామంలో బుధవారం నిర్వహించిన రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. కమీషన్‌ను రూ.2కు పెంచాలన్నారు. ఎండీఎంబకాయిలు వెంటనే చెల్లించాలని, డీలర్లకు గౌరవవేతనం ఇవ్వాలని, ప్రమాదంలో చనిపోయిన డీలర్ల అంత్యక్రియలకు రూ.15వేలు ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. కరోనా సమయంలో పేరుకుపోయిన బకాయిలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం జూలై 23న విజయవాడలో తలపెట్టిన మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పరంధామరెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు సుంకప్ప, కోశాధికారి చిదానందరెడ్డి, మండల అధ్యక్షుడు మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

అమడగూరు: జబ్బు నయం కాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. అమడగూరు మండలం నిలువురాలిపల్లికి చెందిన జయమ్మ (37) గత 16 సంవత్సరాలుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా జబ్బు నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆమె మూర్ఛ వ్యాధి ఉపశమనానికి వైద్యులు ఇచ్చిన మందులను అధిక మోతాదులో సోమవారం రాత్రి మింగి అపస్మారక స్థితికి చేరుకుంది. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను కదిరిలోని సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సకు స్పందించక బుధవారం ఆమె మృతిచెందింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపారు.

సీఎన్‌సీ ప్రోగ్రామ్‌పై ఉచిత శిక్షణ

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) క్యాంపస్‌లోని స్కిల్ కళాశాలలో కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ (సీఎన్‌సీ)పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్.ఆనందరాజ్‌కుమార్ బుధవారం తెలిపారు. బీటెక్ (ఏ బ్రాంచ్ వారైనా), డిప్లొమో (ఏ బ్రాంచ్ వారైనా), ఐటీఐ(టర్నర్, ఫిట్టర్ మాత్రమే) పూర్తి చేసిన వారు అర్హులు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుంది. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాలకు మస్నీల గంగాధర్ (99492 50507), సంజామల రఫీ (94906 82810)ని సంప్రదించవచ్చు.

సోషల్ స్టార్ ప్రశాంత్



అతను ఎంటెక్ చదివాడు. ప్రయత్నిస్తే సాఫ్ట్‌వేర్ రంగంలో మంచి ఉద్యోగమే వచ్చేది. కానీ అందరూ నడిచే దారిలో వెళ్లాలనుకోలేదు. తనకంటూ ప్రత్యేక 'మార్గం' ఉండాలని భావించాడు. ఆ మార్గంలో వెళ్లే క్రమంలో మొదట అందరూ హేళన చేశారు. అయినా నిరుత్సాహపడలేదు. ఎంచుకున్న రంగం ఏదైనా పట్టుదల, చిత్తశుద్ధితో కృషి చేస్తే విజయం సాధించవచ్చునని నిరూపించాడు. ఇంటిల్లిపాదీ ఆనందించే వీడియోలను సొంతంగా రూపొంది స్తూ..అందులో తానే నటిస్తూ సోషల్ మీడియా స్టార్‌గా ఎదిగాడు. అతనే ప్రశాంత్ అలియాస్ ప్రసూబేబీ.

- 'ప్రసూబేబీ'గా సూపర్ ఫేమస్
- యూట్యూబ్‌లో 8.24 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు
- ఇన్‌స్టాలోనూ భారీ ఫాలోయింగ్
- ఇదీ ఎంటెక్ యువకుడి విజయగాథ

సాక్షి, అనంతపురం డెస్క్ :

సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎంతోమంది ప్రతిభావంతులు వెలుగులోకి వస్తున్నారు. తమకున్న నైపుణ్యాలు ప్రదర్శిస్తూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అలాంటి వారిలో ప్రశాంత్ ఒకరు. ఎలాంటి సినీ నేపథ్యమూ లేకపోయినా నటనలో సత్తా చాటుతూ.. అనతికాలంలోనే సోషల్ మీడియా సూపర్ స్టార్‌గా ఎదిగాడు. పొడవాటి జుట్టు, గడ్డంతో స్టైలిష్‌గా కన్పించే ప్రశాంత్ చక్కటి నటన, వైవిధ్యమైన డైలాగ్ డెలివరీతో అందరినీ అలరిస్తున్నాడు. ప్రశాంత్ అంటే ఎవరూ గుర్తు పట్టరు కానీ.. 'ప్రసూబేబీ' అంటే మాత్రం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే వారు ఇట్టే గుర్తు పట్టేస్తారు.

యూట్యూబ్ 'సూపర్ స్టార్'

ప్రసూబేబీ (prashu_baby) పేరిట ప్రశాంత్ ప్రారంభించిన యూట్యూబ్ చానల్‌కు ఏకంగా 8.24 మిలియన్ల సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. సంస్థలను మినహాయిస్తే వ్యక్తిగత విభాగానికి సంబంధించి రాష్ట్రంలో హర్షసాయి తర్వాత అత్యధిక సబ్‌స్క్రైబర్లు ఉన్నది ఈ చానల్‌కే. కామెడీ, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంటు వీడియోలను రెగ్యులర్‌గా రూపొందించి ఇందులో అప్‌లోడ్ చేస్తున్నా డు. వీడియో పెట్టిన కొన్ని నిమిషాల వ్యవధిలోనే లక్షల్లో వ్యూస్ వస్తున్నాయి. ప్రశాంత్ ఇన్‌స్టాగ్రామ్ అకౌంటుకు కూడా 1.4 మిలియన్ ఫాలోవర్లు ఉన్నారు. భాషతో సంబంధం లేకుండా దేశంలోని అన్ని ప్రాంతాల వారు, కువైట్, అమెరికా,సౌదీ తదితర దేశాల ప్రజలు సైతం ప్రశాంత్ వీడియోలను వీక్షిస్తున్నారు. ధరణి, శిశిర, ప్రసూ కాంబినేషన్‌లో వచ్చిన వీడియోలు సూపర్ హిట్ అయ్యాయి.

'అనంత' కేంద్రంగా.. నటనే శ్వాసగా..

ఎంటెక్ చదివేందుకు అనంతపురం వచ్చిన ప్రశాంత్ ఇక్కడి నుంచే సీరియస్ 'యాక్టింగ్' మొదలుపెట్టాడు. నటనపై ఆసక్తి ఉన్న తనలాంటి వారితో కలిసి వీడియోలు రూపొందిస్తున్నాడు. యాక్టింగ్ మొదలుకుని స్క్రిప్టు వరకు అన్నీ తానే చూసుకుంటాడు. ఇలా ఇప్పటివరకు 30 మందికి పైగా తనతో కలసి నటించారు. వారిలో చాలామందికి సొంత యూట్యూబ్ చానళ్లు, ఇన్‌స్టాగామ్ అకౌంట్లు ఏర్పాటు చేయించి..వారూ తగిన ఆదాయం పొందేలా చూస్తున్నాడు. సోషల్ మీడియాలో ప్రశాంత్ పాపులారిటీని గుర్తించిన పెద్ద పెద్ద సంస్థలు సైతం అతనితో వ్యాపార ప్రకటనలు చేయిస్తున్నాయి. సినిమా ప్రమోషన్లు కూడా చేయిస్తున్నారు. ఇటీవలే దసరా, విరూపాక్ష సినిమాలకు ప్రమోషన్ చేశాడు. ఓటీటీ, సినిమా ఆఫర్లు సైతం వస్తున్నాయి. పెద్దసంస్థలతో కలసి ఇతర భాషల్లో సోషల్ మీడియా వేదికగా వినోదాత్మక వీడియోలు రూపొందించే ఆలోచనలో ఉన్నాడు.


దసరా సినిమా ప్రమోషన్‌లో భాగంగా నాని, కీర్తి సురేష్‌తో ప్రశాంత్



అమ్మానాన్నతో కలసి యూట్యూబ్ నుంచి వచ్చిన సిల్వర్, గోల్డెన్‌ప్లే బటన్స్ చూపుతున్న ప్రశాంత్

ఎంటెక్ చదివి.. టిక్‌టాక్‌తో మొదలెట్టి..

ప్రశాంత్ సొంతూరు అన్నమయ్య జిల్లా మదనపల్లెకు సమీపంలోని గొరబురుజు గ్రామం. తల్లిదండ్రులు సావిత్రి, నారాయణ. వీరిది వ్యవసాయ కుటుంబం. ఇద్దరు కుమారులు కాగా..ప్రశాంత్ చిన్నోడు. మదనపల్లెలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ చదివాడు. జేఎన్‌టీయూ (అనంతపురం)లో ఎంటెక్ చేశాడు. ఇంజినీరింగ్ చదువుతుండగానే నటనపై ఆసక్తితో చిన్నచిన్న వీడియోలు సొంతంగా రూపొందించి 'టిక్‌టాక్'లో పెట్టేవాడు. ప్రేమ, మానవత్వం, కుటుంబం ఇతివృత్తంగా వీడియోలు రూపొందించేవాడు. అవి బాగా ట్రెండింగ్‌కావడంతో లక్షల్లో సబ్‌స్క్రైబర్లు వచ్చారు. కేంద్ర ప్రభుత్వం టిక్‌టాక్‌పై నిషేధం విధించడంతో తన దృష్టిని యూట్యూబ్‌పై మళ్లించాడు.



ఇష్టపడి పనిచేయడం వల్లే ఈ స్థాయికి..

ఏ పనైనా ఇష్టపడి చేయాలని నేను భావిస్తా. నేను ఇలా వీడియోలు చేయడాన్ని మొదట్లో స్నేహితులే కాకుండా కుటుంబ సభ్యులు కూడా తప్పుబట్టారు. కానీ సక్సెస్ సాధించి వారితోనే అభినందనలు అందుకున్నా. నిత్య జీవితంలో జరిగే సంఘటనలు, కుటుంబంలో ఉండే సంతోషాలు, సరదాలు, సమస్యలే ఇతివృత్తంగా ఎక్కువ వీడియోలు రూపొందించా. ఇవి భాష, ప్రాంతంతో సంబంధం లేకుండా అందరికీ కనెక్ట్ అయ్యాయి. ఇదే ఉత్సాహంతో మరింత మంచి కంటెంట్ అందివ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా. ముఖ్యంగా వెబ్ సిరీస్‌లపై దృష్టి పెడుతున్నా. – ప్రశాంత్

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో గందరగోళం



ఆందోళన చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు

రాప్తాడురూరల్: కేజీబీవీల్లో సీఆర్టీ పోస్టుల భర్తీలో భాగంగా బుధవారం చేపట్టిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ గందరగోళంగా మారింది. గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసిన తమకే సీఆర్టీగా అవకాశం కల్పించాలని కొందరు పట్టుబట్టారు. వాస్తవానికి కేజీబీవీల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసిన వారికి ఏడాదికి 0.5 మార్కులు వెయిటేజీ ఇస్తున్నారు. గరిష్ఠంగా 7.5 మార్కుల దాకా కొందరు అభ్యర్థులకు వచ్చాయి. అయితే మెరిట్ ఆధారంగా తీసుకోవడంతో చాలా మంది అభ్యర్థులు వీరికంటే ముందు వరుసలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 280 సీఆర్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో అందిన దరఖాస్తులను పరిశీలించి దాదాపు 850 మంది అభ్యర్థులతో మెరిట్ జాబితా సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 250 మంది గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు. వీరిలో చాలామంది మెరిట్ జాబితాలో వెనుకబడ్డారు. దీంతో వారందరూ సర్టిఫికెట్ల పరిశీల ప్రక్రియను అడ్డుకున్నారు. ఇన్నేళ్లుగా పని చేసిన తమకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ డీఈఓ పద్మప్రియ, జీసీడీఓ వాణిదేవి, సూపరింటెండెంట్ సునీల్, ఇతర సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు ఎంత సర్దిచెప్పినా వినలేదు. దీంతో దాదాపు వందమంది సర్టిఫికెట్ల పరిశీలన కాగానే ఈ ప్రక్రియ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ సంఘాలు గెస్ట్ ఫ్యాకల్టీల ఆందోళనకు మద్దతు తెలిపాయి. సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో ఇదివరకే పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలను సీఆర్టీలుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, సీఐటీయూ నగరకార్యదర్శి వెంకటనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, రజిత పాల్గొన్నారు.

అనంతలో నేడు జాతీయ నృత్యోత్సవం

అనంతపురం కల్చరల్: సంధ్యారవళి పేరిట ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి ఆధ్వర్యంలో 12 గంటల నిర్విరామ నృత్యోత్సవం గురువారం జరగనుంది. అనంతపురంలోని టీటీడీ కల్యాణ మంటపం వేదికగా సాగే ఈ నృత్యోత్సవంలో ప్రాతినిథ్యం వహించేందుకు ఇప్పటికే వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు తరలివచ్చారు. ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్విరామ నృత్య ప్రదర్శన ఉంటుంద.ఇ ఉదయం ప్రారంభ కార్యక్రమానికి అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, ఏపీ నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత విశిష్ట అతిథులుగా పాల్గొననున్నారు. రాత్రి ముగింపు వేడుకలకు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా విచ్చేసి కళాకారులను సన్మానించనున్నారు.వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన గురువులకు 'ఆచార్య సింధూ' అవార్డును అందజేయనున్నారు. అలాగే నాట్య కళాకారులకు 'నర్తన సారంగి' అవార్డుతో సత్కరించనున్నారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి గ్రామంలో బుధవారం కుక్కలు దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన బిల్లే నాగరాజు బుధవారం ఉదయం గొర్రెల మందను మేపునకు తోలుకెళుతూ 20 గొర్రె పిల్లలను గూడులో వదిలాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా గూడు కింద మృతి చెందిన గొర్రె పిల్లలు కనిపించాయి. కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందినట్లుగా గుర్తించారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

నల్లచెరువు: ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పెద్దయల్లంపల్లిలో బుధవారం ఇంటి వద్దకే వైద్య సేవలు అందించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ గణేనాయక్ పర్యవేక్షణలో దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అంగన్‌వాడి కేంద్రంలోని పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టి దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ హరిత, ఏఎన్ఎం భాగ్యమ్మ, భార్గవి హెల్త్‌అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, ఆశవర్కర్లు సౌందర్య, ప్రభావతి, ఆదిలక్ష్మి, ఉమాదేవి, భాగ్యమ్మ, 104 పైలెట్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టపర్తిలో కేవీకే ఏర్పాటుకు వినతి

- కలెక్టర్‌కు విన్నవించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు


కలెక్టర్ అరుణ్‌బాబును కలిసిన వ్యవసాయ శాస్త్రవేత్తలు

పుట్టపర్తి అర్బన్: నూతనంగా ఏర్పాటైన శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు కోరారు. ఈ మేరకు నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌సీ వెంకటేశ్వర్లు, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, నంద్యాల కేవీకే శాస్త్రవేత్త సతీష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి బుధవారం కలెక్టర్ అరుణ్‌బాబును కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. జిల్లాలో కేవీకే ఏర్పాటు ద్వారా పంటల సాగులో రైతులకు సత్వర సాంకేతిక సలహాలు అందించేందుకు వీలవుతుందన్నారు. శాస్త్రవేత్తల పరిశోధనా ఫలితాలను ఎప్పటికప్పుడు రైతులకు తెలపడానికి దోహదపడుతుందన్నారు. రైతులకు, గ్రామీణ యువతకు పంటల సాగుపై శిక్షణా కార్యక్రమాలు చేరువవుతాయన్నారు. కేవీకే ఏర్పాటుకు జిల్లా కేంద్రం సమీపంలో సుమారు 60 ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. ఈ భూమిని కేటాయించాలని కోరడంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిర్రెత్తి బైక్‌ను తగులబెట్టిన యువకుడు


టీవీఎస్ షోరూం ఎదుట దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

హిందూపురం: సేవా లోపం కారణంగా అసహనానికి గురైన ఓ యువకుడు షోరూం ఎదుట తన నూతన ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టి నిరసన వ్యక్తం చేశాడు. వివరాలు.. హిందూపురంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న టీవీఎస్ షోరూంలో బీరేపల్లికి చెందిన మనోజ్ ఫైనాన్స్ కింద ఓ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. పట్టుమని ఐదు నెలలు కూడా గడవక ముందే వాహనంలో సమస్యలు ఉత్పన్నమవుతూ వచ్చాయి. సమస్య తలెత్తిన ప్రతిసారీ తాత్కాలిక మరమ్మతులతో సరిబెడుతూ వచ్చారు. అయినా సాంకేతిక సమస్యలు తప్పలేదు. ఈ క్రమంలోనే బుధవారం మరోసారి వాహనం మరమ్మతుకు గురవడంతో షోరూంకు తీసుకెళ్లాడు. ఆ సమయంలో షోరూం నిర్వాహకులతో వాగ్వాదం జరిగి అసహనానికి గురైన మనోజ్ వెంటనే షోరూం ఎదుట తన ద్విచక్ర వాహనాన్ని నిలిపి పెట్రోల్ పోసి తగులబెట్టాడు. ఘటనతో నివ్వెర పోయిన షోరూం నిర్వాహకులు వెంటనే మంటల్ని అదుపు చేశారు. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

జలపాతంలో పడి బాలుడి మృతి


విజయ్‌నాయక్ (ఫైల్)

యాడికి: స్నేహితులతో కలసి విహార యాత్రకు వచ్చిన ఓ బాలుడు.. ప్రమాదవశాత్తు జలపాతంలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం సీతమ్మ తండాకు చెందిన నాగులు నాయక్, శంకరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. మంగళవారం రాత్రి సీతమ్మ తండా పరిసరాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు నాగులు నాయక్ చిన్న కుమారుడు విజయ్‌నాయక్(17) తన స్నేహితులతో కలసి యాడికి మండలం కోనక్షేత్రంలో ఉన్న జలపాతాన్ని చూసేందుకు వచ్చారు. సరదాగా అందరూ జలపాతాల్లో స్నానం చేసిన తరువాత విజయ్‌నాయక్ మారడమ్మ జలపాతం వద్ద పైకి ఎక్కి సెల్ఫీ తీసుకుంటుండగా కాలు జారింది. దాదాపు 40 అడుగుల ఎత్తు నుంచి జలపాతంలోకి పడిన విజయ్ నాయక్‌కు వెన్నముక విరిగింది. తలకు బలమైన గాయమైంది. స్నేహితుల నుంచి సమాచారం అందుకున్న సీతమ్మ తండా వాసులు అక్కడకు చేరుకుని ప్రైవేట్ వాహనంలో డోన్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఆకట్టుకున్న క్విజ్ పోటీలు


విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎల్‌డీఎం రమణకుమార్

ప్రశాంతి నిలయం: జీ–20 సదస్సుపై విద్యార్థుల్లో అవగాహన పెంచేలా 'ఆర్థిక అక్షరాస్యత' అంశంపై కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో బుధవారం నిర్వహించిన క్విజ్ పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా 32 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించినట్లు ఎల్‌డీఎం ఏవీ రమణకుమార్ తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఎంపిక చేసిన ఇద్దరు విద్యార్థులు మండల స్థాయిలో పోటీల్లో పాల్గొన్నారు. పోటీలో విజేతలకు నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ నెల 28న జిల్లా స్థాయి క్విజ్ పోటీలు ఉంటాయని ఎల్‌డీఎం తెలిపారు.

డ్రైవింగ్ విషయంలో అప్రమత్తత అవసరం


డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి సూచించారు. పోలీస్ డ్రైవర్లకు జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వ వాహనాలను సొంత వాహనాల్లా పరిగణిస్తూ వాటి నిర్వహణపై ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై కదిరి ఎంవీఐ డీఎస్ఎం వరప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్టీసీ డీఎం ఇనాయతుల్లా, ఎంటీఓ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జేవీకే స్టాక్ పాయింట్ పరిశీలన


వివరాలు తెలుసుకుంటున్న ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి

మడకశిర/రొళ్ల: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలతో పాటు రొళ్ల మండలం దొమ్మరహట్టిలో ఉన్న బాలుర గురుకుల పాఠశాలలో నిల్వ ఉంచిన జగనన్న విద్యాకానుక కిట్లను ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఎంఈఓలు భాస్కర్, శ్రీధర్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు. కిట్ల పంపిణీపై ఆరా తీశారు. ప్రతి విద్యార్థికి జగనన్న విద్య కానుక కిట్లను అందించాలని సూచించారు. ఉదయం రాగిజావతో పాటు మధ్యాహ్నం నాణ్యమైన భోజనాన్ని వండి పెట్టేలా ఏజెన్సీలను పర్యవేక్షించాలన్నారు. బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పాఠశాలల పర్యవేక్షణ సక్రమంగా చేయాలి

ప్రశాంతి నిలయం: పాఠశాలల నిర్వహణతో పాటు, విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ ఫలాలు సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని ఎంఈఓలకు ఇన్‌చార్జ్ డీఈఓ రంగస్వామి సూచించారు. బుధవారం కొత్తచెరువులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాలోని 32 మండలాల పూర్వ, నూతన విద్యాధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. జగనన్న విద్యాకానుక, అమ్మ ఒడి, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు, జగనన్న గోరుముద్ద తదితర అంశాలపై సమీక్షించారు. నూతనంగా మండల విద్యాధికారులుగా బాధ్యతలు తీసుకున్న వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, పరీక్షల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ లాజరు, సిబ్బంది పాల్గొన్నారు.